క్లుప్తంగా

ప్రైవేటు స్కూళ్ల గుర్తింపుపై తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి: మండలంలోని ప్రైవేటు పాఠశాలలను ఎంఈఓ శ్రీదేవి సోమవారం తనిఖీచేశారు. డీఈఓ ఆదేశానుసారం ప్రైవేటు పాఠశాలలను సందర్శించిన ఆమె పాఠశాలల గుర్తింపు, అనుమతులు, వసతులను ప్రత్యక్షంగా వెళ్లి ఆమె పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంఈఓ–2 నమశ్శివాయం పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నింద్ర: వరి, వేరుశనగ పంటలను ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని ఏఓ తులసీరాం తెలిపారు. సోమవారం మండలంలోని అగరం గ్రామాల్లో వేరుశనగ, వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ చేపట్టి, తప్పనిసరిగా మందులు పిచికారీ చేయాలని సూచించారు. వేరుశనగ పంటను ఆశించే పచ్చపురుగు నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: చవటగుంటలో ఉన్న ఆవుదేవర మీనాక్షి సమేత నందీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నందీశ్వరుడికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

నేడు కూరగాయల సంత రద్దు

నింద్ర: మండలకేంద్రం నింద్ర గ్రామంలో మంగళవారం జరిగే కూరగాయల సంతను రద్దు చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి ధరణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉండడం వల్ల సంతను నిలిపివేయడం జరిగింది. ప్రజలు గమనించాలని కోరారు.

అన్నదానానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన అఖిల్‌రెడ్డి నిత్య అన్నదానానికి రూ.1,11,116 విరాళంగా అందజేశారు. ఆ నగదును ఆలయ అధికారులకు నగదు రూపంలో అందజేశారు. వారికి ఆలయ అధికారులు స్వామి దర్శనభాగ్యం కల్పించారు. పండితుల ఆశీర్వచనాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు వాసు, విఘ్నేష్ తదితరులు ఉన్నారు.

పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో పూజలు నేడు



నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో ఉన్న సర్వ మంగళ సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ ఈఓ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామివారికి, మరకదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రదోష పూజల్లో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి, రసీదు పొందాలని తెలిపారు.

కౌంట్‌డౌన్ స్టార్ట్





నగరి నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ పహారా(ఇన్‌సెట్) అధికారులతో చర్చిస్తున్న ఆర్‌ఓ

- నేడు 21 రోజుల ఉత్కంఠకు తెర
- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- టెన్షన్ పడిపోతున్న బెట్టింగ్‌రాయుళ్లు

నగరి: పోలింగ్ ముగిసి 21 రోజుల పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. నేడు నగరి నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ పూతలపట్టు ఆర్‌కేఎం లా కాలేజీలో జరగనుంది. ఇప్పటికే కౌంటింగ్‌కు సంబంధిత అన్ని ప్రక్రియలను ఎన్నికల సంఘం పూర్తిచేయగా సోమవారం ఉదయం నుంచి లెక్కింపు ప్రారంభం కానుంది. నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియకు 14 టేబుళ్లు ఉంటాయని ఎన్నికల అధికారి వెంకటరెడ్డి తెలిపారు. పోటీలో ఉన్న ఏడుగురు అభ్యర్థులు తమ పార్టీకి సంబంధించి ఒక్కో టేబుల్‌కు ఒక ఏజెంట్, పోస్టల్ బ్యాలెట్‌కు ముగ్గురు ఏజెంట్లు అంటూ 17 మంది ఏజెంట్లను నియమించుకున్నారు. దీంతో నియోజకవర్గ ఎన్నికల ప్రక్రియలో 119 మంది ఏజెంట్లు ఉంటారు. వీరి సమక్షంలో అధికారులు ఓట్లను లెక్కించనున్నారు. నియోజకవర్గంలో 98537 మంది పురుష ఓటర్లు, 104029 మంది మహిళా ఓటర్లు, ట్రాన్స్ జెండర్లు 8 ఓట్లు ఉండగా మొత్తం 202574 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 86078 మంది పురుషులు, 90316 మంది మహిళలు, ఐదుగురు ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 231 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ నిర్వహించారు. దీంతో నియోజకవర్గంలో 87.08 శాతం ఓట్లు పోలైంది. ఇందులో ఎవరెవరికి ఎన్ని ఓట్లు పోలైందో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో తేటతెల్లం కానుంది. 21 రోజుల పాటు నియోజకవర్గ ప్రజల ఉత్కంఠకు తెర తొలగనుంది.

ఉత్సాహంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు..

ఎగ్జిట్ పోల్ ఫలితాలు, మహిళలు అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవడం, జగనన్న అందించిన సంక్షేమం పథకాలు, అభివృద్ధి, గత ఎన్నికలతో పోల్చుకుంటే అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండడం లాంటివి తమకు కలిసివచ్చే శుభపరిణామాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు విశ్వసిస్తున్నాయి. దీంతో వారు ఉత్సాహంతో ఉన్నారు.

వేణుగోపాల స్వామివారి సేవలో భూమన అభినయ్



తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌ని సన్మానిస్తున్న వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

కార్వేటినగరం: ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారిని తిరుపతి డిప్యూటీ మేయర్, వైఎస్‌ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ సోమవారం దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అభినయ్‌కి స్వామివారి తీర్థ ప్రసాధాలను అందించి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా భూమన అభినయ్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో విజయం సాధించి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ప్రమాణ స్వీకారం చేయాలని, అలాగే తనను తిరుపతి ఎమ్మెల్యేగా విజయం సాధించేలా ఆశీర్వచనాలు అందించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్వేటినగరం వైఎస్‌ఆర్ సీపీ నాయకులు అక్కడికు చేరుకుని అభినయ్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రదోష పూజలు

వెదురుకుప్పం: డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై కొలువైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు రమేష్ సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఏకకాలంలో నందీశ్వరునికి, శివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కన్నికలమ్మకు ప్రత్యేక పూజలు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో ఉన్న కన్నికలమ్మ గ్రామదేవతకు సోమవారం బీసీ కాలనీ వాసులు ఘనంగా పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



వంట నిర్వాహకులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓ

విజయపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని వంట నిర్వాహకులకు సోమవారం పౌష్టికాహారంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ–2 హరిప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో విజయపురం ఉన్నత పాఠశాల ఆవరణలో వంట నిర్వాహకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు చేసిన వంటలను రుచి చూసి, బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో, వంట నిర్వాహకులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. పిల్లలు విద్యార్థి దశ నుంచే ఆరోగ్యం, బలంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మరి కొద్దిరోజుల్లో పాఠశాలల పునఃప్రారంభం కానున్నాయని, ఇలాంటి శిక్షణ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌బీ హెచ్‌ఎంలు శ్రీనివాసులు, ఉమాశంకర్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

గజరాజుపై వేణుగోపాలుడి విహారం



గజ వాహనంపై విహరిస్తున్న వేణుగోపాలుడు

కార్వేటినగరం: కార్వేటినగరంలోని వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు సోమవారం రాత్రి గజ వాహనంపై, ఉదయం హనుమంత వాహనంపై స్వామివారు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. చెక్కభజనలు, కోలాట ప్రదర్శనలు, భక్తజనుల గోవింద నామస్మరణ, మంగళవాయిద్యాలు, వేద ఘోష నడుమ వాహన సేవలు అంగరంగ వైభవంగా సాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా తోమాల, అర్చన, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, శాత్తుమొర, మొదటి గంట, బలి కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు హనుమంత వాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి వేదపండితులు ఆలయంలో వేదమంత్రాలతో వసంతోత్సవం, ఆస్థానం నిర్వహించి పసుపు, చందనం తదితర సుగంధ ద్రవ్యాలను చల్లారు. అనంతరం స్వామివార్లను మాడవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయంలో శుద్ధి, తోమాల, రాత్రి గంట చేపట్టారు. అదే విధంగా సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల నడుమ పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలోకి వేంచేపు చేసి, పండితుల వేద మంత్రాల నడుమ ఊంజల్ సేవా కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన సంగీత కచేరీ

టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య ప్రాజెక్టు వారు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. స్వామివారికి వివిధ రకాలైన భక్తి గీతాలను ఆలపించారు. రాత్రి 7గంటలకు స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి గజ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం గజవాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9.45 గంటలకు టీటీడీ వేదపండితులు స్వామివారిని ఏకాంత సేవలో పవళింప చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరిస్తారని ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.





హనుమంత వాహనంపై వేణుగోపాలుడు, స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న వేదపండితులు

గంధమనేని పారిజాతమ్మకు నివాళి



పారిజాతమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న నారాయణ, జయచంద్రనాయుడు

పుత్తూరు: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నేత, దివంగత పుత్తూరు మాజీ ఎమ్మెల్యే గంధమనేని శివయ్య సతీమణి పారిజాతమ్మ (84) మృతికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. కుమారుడు గంధమనేని గౌతమ్‌తో చెన్నైలో నివసిస్తున్న పారిజాతమ్మ ఆదివారం తుదిశ్వాస విడిచిన విషయం విదితమే. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్రనాయుడు, డీసీసీబీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు గంధమనేని హరీష్‌నాయుడు సోమవారం చెన్నైలోని కోడంబాక్కంలో ఆమె స్వగృహానికి వెళ్లి పారిజాతమ్మ పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గంధమనేని సేవలు నిరుపమానం..

సీపీఐ సీనియర్ నేత గంధమనేని శివయ్య పుత్తూరు ఎమ్మెల్యేగా చేసిన సేవలు నిరుపమానమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. పారిజాతమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ గాజులమండ్యం ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ ఏర్పాటులో శివయ్య ప్రధాన భూమిక పోషించినట్లు గుర్తు చేశారు. 1970 దశకంలోనే శివయ్య వ్యవసాయంపై సమగ్రంగా అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఉన్నత కుటుంబంలో జన్మించిన శివయ్య ఎమ్మెల్యే అయినా చివరి వరకు సాధారణ జీవితాన్నే గడిపారన్నారు. శివయ్య, పారిజాతమ్మ దంపతులిద్దరూ తుది శ్వాస వరకు వామపక్ష భావజాలాలతోనే అనుసరించడం గర్వంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడు పారిజాతమ్మకు వరుసకు సోదరుడు కావడం గమనార్హం. అనంతరం పారిజాతమ్మ కుమారుడు గంధమనేని గౌతమ్, కుమార్తె విజయలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులకు నారాయణ, జయచంద్రనాయుడు ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో ఆల్ ఇండియా హ్యాండ్‌లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ కె.కళ్యాణ్‌చక్రవర్తి, సీపీఐ నేతలు రామానాయుడు, చిన్నిరాజ్, పిచ్చాటూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలాజీనాయుడు తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా దూరం



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలను పూర్తిగా అరికట్టవచ్చని, తద్వారా మలేరియా వంటి జ్వరాలను దూరం చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం బ్యానర్‌ను తిరుపతిలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ శ్రీహరి మాట్లాడుతూ దోమలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రజలు ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఎక్కడా వ్యర్థపునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం, తరచూ బ్లీచింగ్ పిచికారీ చేసుకోవడం వల్ల దోమలను పూర్తిస్థాయిలో అరికట్టవచ్చన్నారు. ఈనెల 35 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మాస్ మీడియా అధికారి బాబు నెహ్రూ రెడ్డి, జిల్లా మానిటరింగ్ సెల్ అధికారులు ఏఎస్‌ఎంలు, మలేరియా యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి

- విత్తనాలు, పురుగు మందుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి
- వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్



వేరుశనగ విత్తనాలు వేరు చేస్తున్న కూలీలు



వేరుశనగ విత్తనాలు వేస్తున్న కూలీలు

పాలసముద్రం: రైతులు పంటసాగు చేయడానికి ముందు ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, లేదంటే కష్టం బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ సూచించారు. రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలుపై సరైన అవగాహన లేక నష్టపోతున్నారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో నకిలీల బెడద ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఆయన తెలిపిన సూచనలు కింది విధంగా ఉన్నాయి.

విత్తన కొనుగోలు

వ్యవసాయశాఖ లైసెన్సు పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తన కొనుగోలు బిల్లుపై నంబరు, విత్తన రకం, గడువు తేదీలు, డీలరు సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనొద్దు. గడువు దాటిన విత్తనాల జోలి వెళ్లొద్దు. మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యేంత వరకు దాచి పెట్టుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉన్న వాటినే విత్తనాలుగా వాడాలి.

పురుగు మందుల కొనుగోలు

చీడపీడలకు వినియోగించే క్రిమిసంహారక మందుల కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ, ఉద్యాన శాఖ, శాస్త్రవేత్తలు సూచించిన పురుగుల మందులే వినియోగించాలి.

- అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగు మందులను వాడొద్దు. లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై వజ్రాకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే డబ్బాలపై ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడకూడదు. వాడిన డబ్బాలు, సీసాలు ధ్వంసం చేసి గుంతలో పూడ్చి పెట్టాలి. పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించరాదు.

ఎరువుల కొనుగోలు

లైసెన్సు దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లులు, ఖాళీ సంచులను పంటకాలం పూర్తయే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.

- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. ఒకవేళ చేతి కుట్లు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఉండాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయాధికారి సహాయంతో ఎరువులను పరీక్షలకు పంపాలి. చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీదిగా గుర్తించాలి.

కల్తీని ఇలా గుర్తించండి

యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్ వంటి ఎరువులు గుళికల రూపంలో ఉంటాయి. 15:15:15, 20:20:0 ఎరువులు రేణువుల రూపంలో, పొటాష్, సూపర్ పాస్ఫేట్ పొడి రూపంలో ఉంటాయి.

- 5 మిల్లీ లీటర్ల నీటిలో చెంచా ఎరువును వేసి బాగా కలపాలి. ఇది స్వచ్ఛమైన ద్రావణంగా తయారైతే నాణ్యమైన ఎరువుగా గుర్తించవచ్చు. యూరియా, అమ్మోనియా క్లోరైడ్ ఎరువుల పరీక్షకు 10 మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి.
- 15:15:15, 28:28:0, 19:19:19, 17:17:17, 24:24:0, యూరియా వంటి ఎరువులను ఒక చెంచాడు ఐదు మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిలో వేసి బాగా కలిపితే అడుగున మడ్డి చేరితే కల్తీగా గుర్తించాలి. కొన్ని కాంప్లెక్స్ ఎరువులను ఇదే పద్ధతిలో పరీక్షిస్తే ఇసుక రేణువులు వచ్చే అవకాశం ఉంది. అలా వచ్చినా కల్తీ ఎరువుగా గుర్తించాలి.



ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు



వేరుశనగ సాగుకు ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు